సర్కార్ తీరుపై అంగన్‌వాడీ, ఆశల నిరసన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఉమ్మడి నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో బుధవారం అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఆందోళనలు చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట దీక్షలు చేపట్టి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ.లక్ష చొప్పున రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. గాంధారిలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. – న్యూస్ నెట్‌వర్క్

కాళేశ్వరం కాలువ సర్వే అడ్డగింత

కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు కాళేశ్వరం కాలువ నిర్మాణం కోసం ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణను వెంటనే నిలిపివేయాలని మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం చిన్నచింతకుంట వద్ద రైతులు ధర్నా చేపట్టారు. పంట పొలాల నుంచి కాలువ నిర్మాణ పనుల నిమిత్తం అధికారులు సర్వే చేయడానికి బుధవారం గ్రామానికి వచ్చారు. సర్వే అధికారులను బాధిత రైతులు అడ్డుకున్నారు. పోలీసులు వచ్చి నచ్చచెప్పినా రైతులు వినకపోవడంతో సర్వే అధికారులు వెనుదిరిగారు. – నర్సాపూర్

ఫార్మా కంపెనీపై భగ్గుమన్న రైతులు

ఫార్మా కంపెనీ నుంచి వచ్చే కాలుష్యంతో పంటలకు తీవ్ర నష్టం కలుగుతున్నదని, వెంటనే కంపెనీని మూయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా మహ్మదాబాద్ మండలం దేశాయిపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద రైతులు బైఠాయించారు. దేశాయిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన ఫార్మా కంపెనీతో పంటలకు, పశువులకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫ్యాక్టరీ నుంచి వచ్చే దుర్వాసన భరించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. –మహ్మదాబాద్

జీతాల కోసం పంచాయతీ కార్మికుల ధర్నా

వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు బుధవారం ధర్నాకు దిగారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, దీంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. – ఎడపల్లి

భూసేకరణ బాధ్యత కలెక్టర్లదే

మొదటిపేజీ తరువాయి...

భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రావడం లేదని కలెక్టర్లు తెలిపారు. దీనిపై సీఎం స్పందిస్తూ, తరతరాలుగా వస్తున్న భూములను రైతులు శాశ్వతంగా కోల్పోతున్నారనే విషయాన్ని దృష్టిలో ఉంచుకొని కలెక్టర్లే స్వయంగా రైతులను పిలిచి మాట్లాడి వారిని ఒప్పించాలని సూచించారు. ప్రాంతీయ రింగ రోడ్డు (ట్రిపుల్ ఆర్) దక్షిణ భాగం, ఉత్తర భాగం వేర్వేరుగా చూడొద్దని, ఆ రెండింటికీ కలిపి ఒకే నంబర్ కేటాయించేందుకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారని చెప్పారు. దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఎన్‌హెచ్ఏఐ మధ్య త్రైపాక్షిక ఒప్పందం (ట్రైపార్టియేట్ అగ్రిమెంట్) ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు.

కోర్టు స్టేపై రేపు కౌంటర్ దాఖలు

రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ విషయంలో రైతుల పిటిషన్‌పై హైకోర్టు స్టే ఇచ్చిందని యాదాద్రి భువనగిరి కలెక్టర్ హన్మంత్ కే జెండగే తెలిపారు. స్టే తొలగింపునకు వచ్చే శుక్రవారం నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నాగ్‌పూర్–విజయవాడ కారిడార్‌కు సంబంధించి ఖమ్మం సమీపంలో భూములకు పరిహారం విషయంలో రైతులను ఒప్పిస్తున్నామని ఖమ్మం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. తల్లాడ–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ రహదారి పనులు సాగుతున్నందున, ప్రస్తుతం ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు ఉన్న జాతీయ రహదారిని రాష్ట్ర రహదారిగా మార్చుకోవాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సూచిస్తున్నారని చెప్పారు. దానికి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని, జాతీయ రహదారిగానే దానిని కొనసాగించాలని మంత్రి సూచించారు.

అటవీశాఖకు ప్రత్యామ్నాయ భూములు

ఆర్మూర్–జగిత్యాల–మంచిర్యాల, విజయవాడ–నాగ్‌పూర్ రహదారుల్లో అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ భూములు కేటాయించాలని నిజామాబాద్, మంచిర్యాల, మహబూబాబాద్ జిల్లాల కలెక్టర్లకు సీఎం సూచించారు. హైదరాబాద్ –మన్నెగూడ రహదారి పనులు సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని చెప్పారు.

2 నెలల్లో హైదరాబాద్–విజయవాడ రోడ్డు విస్తరణ

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణ పనులకు భూసేకరణ పూర్తయినందున వెంటనే పనులు చేపట్టాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు మెంబర్ అనిల్ చౌదరిని కోరారు. రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ఆయన బదులిచ్చారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి ఓఎస్డీలు శేషాద్రి, మాణిక్‌రాజ్, చంద్రశేఖర్‌రెడ్డి, షానవాజ్ ఖాసిం, మౌలిక వసతుల సలహాదారు శ్రీనివాసరాజు, ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి రజాక్, పీసీసీఎఫ్ డోబ్రియల్, ఆర్‌అండ్‌బీ స్పెషల్ సెక్రటరీ దాసరి హరిచందన, జాయింట్ సెక్రటరీ హరీశ్, వివిధ జిల్లాల కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

రీజినల్ రింగ్ రోడ్డు భూ బాధితులు మరోసారి రోడ్డెక్కారు. సాగు భూములు తీసుకోవద్దంటూ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధితులు బుధవారం ర్యాలీగా వచ్చి గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ వద్ద రాజీవ్ రహదారిపై బైఠాయించారు. మర్కూక్ మండలం చెబర్తి, నర్సన్నపేట, ఇటిక్యాల, ఇప్పలగూడెం, జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి రైతులు ప్లకార్డులు పట్టుకొని రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు ఇటిక్యాల భాస్కర్, ఎల్లారెడ్డి, కిష్టయ్య, భిక్షపతి, సాయిలు, బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో సాగు భూములను కోల్పోవాల్సి వస్తుందని వాపోయారు. సాగుకు అనుకూలంగా లేని భూముల్లో నుంచి రోడ్డు నిర్మాణం చేపడితే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాలని కోరారు.

13న జేఎన్టీయూకు సీఎం రేవంత్

- 'గోల్డెన్‌జూబ్లీ' ప్రారంభోత్సవం
- నిపుణులతో సమావేశాలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లిలోని జేఎన్టీయూ ప్రధాన క్యాంపస్‌ను సందర్శించనున్నారు. ఈ మేరకు సీఎంవో వర్గాలు బుధవారం జేఎన్టీయూ అధికారులకు సమాచారాన్నిచ్చాయి. శనివారం మధ్యాహ్నం 2:30 గంటలకు జేఎన్టీయూ ఆడిటోరియంలో అన్ని కాలేజీల ప్రిన్సిపాళ్లు, యాజమాన్యాలతో సీఎం సమావేశమవుతారు. ఈ సందర్భంగా 'క్వాలిటీ ఆఫ్ ఇంజినీరింగ్ ఇన్ టెక్నికల్ కాలేజీస్' అనే అంశంపై సమావేశం నిర్వహించనున్నారు. ఓయూ, జేఎన్టీయూ, కేయూ పరిధిలోని 205 కాలేజీల ప్రతినిధులను ఆహ్వానించారు. ఇంజినీరింగ్ విద్యలో విద్యాప్రమాణాల పెంపు, నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై సమావేశంలో చర్చిస్తారు. పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి జేఎన్టీయూలో కొత్తగా నిర్మించిన గోల్డెన్‌జూబ్లీ భవాన్ని ప్రారంభిస్తారని ఇన్‌చార్జి వీసీ బుర్రా వెంకటేశం తెలిపారు. సీఎం పర్యటన నేపథ్యంలో బుధవారం ఆయన వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రావు సహా పలు విభాగాల అధికారులతో సమీక్షించారు. జేఎన్టీయూలో నిర్వహించే సభకు హాజరైన తర్వాత సీఎం బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ స్విస్ అండ్ ఇన్స్యూరెన్స్ పరిశ్రమ నిపుణులతో సమావేశమవుతారు. ఆ తర్వాత ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు, కో ఆర్డినేటర్లు, వలంటీర్లు, పోలీసు అధికారులతో డ్రగ్స్ నియంత్రణ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణ, మహిళలు, బాలికల రక్షణ వంటి అంశాలపై చర్చిస్తారు. 'ఏఐ.. సమాజంపై ప్రభావం' అనే అంశంపై అధికారులతో సమీక్షిస్తారు.

5వ ఫ్లోర్‌లోకి సీఎంవో?

- సచివాలయంలో మళ్లీ మార్పులు
- వారం రోజుల్లో పనులు మొదలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): సచివాలంయలోని ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ఐదో అంతస్తుకు మార్చనున్నట్టు ప్రచారం జరుగుతున్నది. సీఎం రేవంత్‌రెడ్డి చాంబర్, సీఎంవో ముఖ్యకార్యదర్శి, సలహాదారులు ఆరో అంతస్తులోనే కొనసాగుతారని, ఇతర కార్యదర్శుల పేషీలు ఐదో అంతస్తుకు తరలిస్తారని విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఐదో అంతస్తులో వారం రోజుల్లో పనులు మొదలు కానున్నట్టు చెప్పుకుంటున్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజల్లో ఆదరణ తగ్గిపోవడం, రోజూ ఏదో ఒకచోట, ఎవరో ఒకరు ధర్నాలు, నిరసనలతో రాష్ట్రం అట్టుడుకుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వాస్తు మార్పుల్లో భాగంగా ఐదో అంతస్తుకు కార్యాలయాల తరలింపు తెరమీదికి వచ్చిందనే వాదనలు ఉన్నాయి. ఇప్పటికే ఆరో అంతస్తులోని సీఎం కార్యాలయంలో వాస్తు మార్పు ఆగమేఘాల మీద జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆయన సచివాలయంలోకి వచ్చి పోయే మార్గాల్లో మార్పులు చేశారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో ఆరో నంబర్ అచ్చిరాలేదని ప్రభుత్వ పెద్దలు అనుకుంటున్నట్టు తెలిసింది. ప్రభుత్వ పాలనాపరమైన కార్యాలయాలను ఐదో అంతస్తులోకి తరలించాలని భావిస్తున్నట్టు పేర్కొంటున్నాయి.

సునీల్ కనుగోలును ప్రశ్నించాలి

- టికెట్ విషయంలో నాకు అన్యాయం జరిగింది
- సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇస్తే గెలిచేవాడిని
- కురియన్ కమిటీకి కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ డిమాండ్

హైదరాబాద్, జూలై 10(నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో ఆశించిన ఫలితాలు రాకపోవడానికి గల కారణాలపై విశ్లేషించేందుకు వస్తున్న కురియన్ కమిటీ తొలుత వ్యూహకర్త సునీల్ కనుగోలును ప్రశ్నించాలని ఆ పార్టీ సీనియర్ నేత వీ హన్మంతరావు డిమాండ్ చేశారు. తనకు సికింద్రాబాద్ ఎంపీ టికెట్ ఇస్తే గెలిచేవాడినని చెప్పారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. అందరూ కనుగోలు అని పిలిచినా తాను మాత్రం 'కొనుగోలు' అంటానని స్పష్టంచేశారు. ఎనిమిదేండ్లుగా ఎలాంటి పదవీ దక్కలేదని, రాజ్యసభ టికెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రీడలను ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. టీ 20 వరల్డ్ కప్ గెలిచిన క్రికెట్ టీంలో సభ్యుడైన హైదరాబాదీ మహ్మద్ సిరాజ్‌ను సన్మానించి, ఆయనకు ఇంటిస్థలం, ఉద్యోగం ఇవ్వడంపై సీఎంను అభినందించారు.

నేడు గాంధీభవన్‌కు కురియన్ కమిటీ

లోక్‌సభ ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం ఏర్పాటు చేసిన కురియన్ కమిటీ గురువారం నుంచి తన పనిని మొదలుపెట్టనుంది. ఇందులో భాగంగానే బుధవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న కమిటీ సభ్యులు కురియన్, రహీబుల్ హుస్సేన్, పర్గత్‌సింగ్ గురువారం ఉదయం 10 గంటలకు గాంధీభవన్‌కు రానున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలను ప్రశ్నించే అవకాశం ఉంది. ఎన్నికల్లో వైఫల్యాలకు గల కారణాలపై విశ్లేషించనుంది.

రిజర్వేషన్ల తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ, జూలై 10: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి, కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 50 శాతం వరకు పెంచాలని, రిజర్వేషన్లు లేకుండా ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచుతామని రాహుల్‌గాంధీ వాగ్దానం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సురేశ్, పండరీనాథ్ పాల్గొన్నారు.

యూట్యూబర్ ప్రణీత్ అరెస్ట్

మొదటిపేజీ తరువాయి...

అదుపులోకి తీసుకున్నారు. ప్రణీత్‌ను త్వరలో బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తీసుకురానున్నట్టు తెలిసింది. అతనిపై ఇప్పటికే పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసు నమోదైంది. ప్రణీత్, దల్లాస్ నాగేశ్వర్‌రావు, మరో ఇద్దరు కలిసి 'డార్క్ కామెడీ' పేరుతో ఓ తండ్రీ–కూతురు వీడియోపై జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసి శునకానందం పొందారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తొలుత నటుడు సాయిధరమ్ తేజ్ స్పందించారు. 'సోషల్ మీడియాలో మృగాలు ఎక్కువైపోయాయి. పిల్లల వీడియోలను సోషల్ మీడియాలో పెట్టేటప్పుడు తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి' అంటూ ఆయన ఓ పోస్టు పెట్టారు. ప్రణీత్‌పై చర్యలు తీసుకోవాలని టాలీవుడ్ నటులు మంచు మనోజ్, విశ్వక్‌సేన్, అడివిశేష్, కార్తికేయ, సుధీర్‌బాబు సహా పలువురు ఏపీ, టీజీ ప్రభుత్వాలను కోరారు. ఈ నేపథ్యంలో ప్రణీత్‌ను అరెస్టు చేసిన పోలీసులు.. మిగతా ముగ్గురిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

అనైతికతకు అడ్డాగా సోషల్ మీడియా!

ప్రభుత్వ నియంత్రణ లేకపోవడమే కారణం

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 10 (నమస్తే తెలంగాణ): సమాచార వ్యాప్తికి, సామాజిక వికాసానికి దోహదపడాల్సిన సోషల్ మీడియా అనైతికతకు అడ్డాగా మారింది. దీన్ని అదుపు చేయడంలో పాలకులు విఫలమవుతుండటంతో ఎంతో మంది రెచ్చిపోతున్నారు. గిట్టనివారిపై యూట్యూబ్, ఎక్స్, ఫేస్‌బుక్, వాట్సాప్ మాధ్యమాల్లో అసభ్యకరమైన పోస్టులు చేయడంతో హత్యలకు, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయి. తండ్రి, బిడ్డకు సంబంధించిన ఓ వీడియోపై ఇటీవల యూట్యూబర్ ప్రణీత్ కామెంట్లపై సభ్యసమాజం భగ్గుమంటున్నది. అతడిపై బెంగుళూరు, తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల బేగంపేటలో ఉస్మాన్ హత్యకూ సోషల్ మీడియా కామెంట్లే కారణమయ్యాయి. తనకు ఇష్టమైన యువతితో పెండ్లి చేసేందుకు ఆమె కుటుంబసభ్యులు నిరాకరించడంతో ఉస్మాన్ స్నాప్‌చాట్‌లో నకిలీ అకౌంట్ తెరిచి, యువతిపై తప్పుడు ప్రచారం చేశాడు. దీంతో ఆ యువతి మామ, మరికొందరు కలిసి ఉస్మాన్‌ను హతమార్చారు. నిరుడు జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ వర్గీయులకు వ్యతిరేకంగా ఓ మాజీ రౌడీషీటర్ వీడియోలను పోస్టు చేయడంతో ఆయనను హత్య చేశారు.

విదేశాల్లో ఉంటూ అభ్యంతరకర పోస్టులు

కొందరు విదేశాల్లో ఉండి సోషల్ మీడియాలో అభ్యంతకర పోస్టులు పెడుతూ ప్రజల మధ్య ద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడంతో పగలు, ప్రతీకారాలను తీర్చుకునేందుకు సోషల్ మీడియాను వేదికగా వాడుకొంటున్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లంతా నిబంధనలను పాటించేలా చూడాలని, చట్టాలను ఉల్లంఘిస్తే శిక్షలకు గురికాకతప్పదన్న భయం కల్పించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సారీ అంటే సరిపోతుందా?

ప్రణీత్ రూపొందించిన వీడియోపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో 'సారీ' అంటూ ఆయన సింపుల్‌గా ఓ వీడియో రిలీజ్ చేశాడు. దీంతో 'అరాచకంగా మాట్లాడి సారీ చెప్తే సరిపోతుందా?' అని నెటిజన్లు నిలదీస్తున్నారు. ఐఏఎస్ అధికారి అరుణ్‌కుమార్ తనయుడు ప్రణీత్ తనయుడైన ప్రణీత్ యూట్యూబ్ కంటెంట్ క్రియేటర్లలో ఒకడు. రోస్ట్ వీడియోలు చేస్తూ పాపులర్ అయ్యాడు. అతని చానల్‌కు లక్షకుపైగా ఫాలోవర్స్ ఉన్నారు. ప్రణీత్ అన్నయ్య అజయ్ హనుమంతు కూడా యూట్యూబరే. స్టైలిష్ టిప్స్‌తో పాపులర్ అయిన 'ఏ జూడ్' చానల్‌ను ఆయన నడిపిస్తున్నాడు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న భీమ్‌రావ్, పరశురామ్ తదితరులు

కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలి

- 29న చలో ఢిల్లీ: సీఏపీఎస్ఎస్ అధ్యక్షుడు పరశురాం

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫొటోను కరెన్సీపై ముద్రించాలని కరెన్సీపై అంబేద్కర్ ఫోటో సాధన సమితి (సీఏపీఎస్ఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెరిపోతుల పరశురామ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా ఈ నెల 29, 30, 31వ తేదీల్లో సమితి ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ముంబైలో బుధవారం చలో ఢిల్లీ పోస్టర్‌ను అంబేద్కర్ రెండో మనుమడు భీమ్‌రావు యశ్వంత్ అంబేద్కర్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంజీవ, శంకర్ , చాంద్, శ్యాం దాపన్, రోహన్, రాజు, బాబు, శ్రీను పాల్గొన్నారు.

అసెంబ్లీ తర్వాత 'రైతుభరోసా'

- ప్రజల అభిప్రాయం మేరకే విధివిధానాలు ఖరారు
- ఆదాయపన్ను చెల్లించే వారికి పంటల సాయం కట్
- రియల్ ఎస్టేట్, సాగుకు పనికిరాని భూములకు బంద్
- 'రైతుభరోసా' సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి
- రైతులకు న్యాయమే సర్కారు లక్ష్యం: తుమ్మల, పొంగులేటి
- 'రైతుభరోసా'పై ఖమ్మం జిల్లాలో విస్తృతస్థాయి సమావేశం

మామిళ్లగూడెం, జూలై 10: ప్రజలు, రైతుల సూచనల మేరకే విధివిధానాలు రూపొందించి రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని, అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తరువాతే పథకం అమలుకు నిర్ణయం తీసుకుంటామని ఆ పథకం రాష్ట్ర క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టంచేశారు. ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు పంటల సాయం నిలుపుదల చేయాలని, రియల్ ఎస్టేట్, సాగుకు పనికిరాని భూములకు కూడా పంటల పెట్టుబడి సాయాన్ని బంద్ పెట్టాలని రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. ఈ పథకం అమలు కోసం రైతులు, ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించేందుకు ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సభ్యులైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రైతులకు పంటల పెట్టుబడి కోసం రైతుభరోసా పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చామని, ఆ హామీని అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టంచేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే నిధులను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడుతుందని తెలిపారు. రాష్ట్ర పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలోనే రైతుభరోసా అమలుపై విధివిధానాల రూపకల్పన చేస్తామని చెప్పారు. క్యాబినెట్ సభ కమిటీ సభ్యులు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. నిజమైన రైతులకే రైతుభరోసా అందించేందుకు అన్ని వర్గాల ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రైతుభరోసా అందిస్తామని వివరించారు. మరో తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లోనూ ప్రజల అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని రైతులు, రైతు సంఘాల నాయకులు, కౌలు రైతులు, వైద్యులు, న్యాయవాదులు, పాత్రికేయులు, శాస్త్రవేత్తలు, ఇతర వర్గాల ప్రజలు పాల్గొని సాగుభూమికే భరోసా అందజేసి చిన్న, సన్నకారు రైతులకు న్యాయం చేయాలని, ఆదాయపు పన్ను చెల్లింపుదారులను తొలగించాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాలేని రైతులకు పంటల సాయం అందించాలని, అన్ని పంటలకు బోనస్ ఇవ్వాలని, కౌలు రైతులకు బోనస్ అందించాలని అభిప్రాయాలు వెల్లడించారు. ఈ సమాశంలో ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే రామకృష్ణారావు, ఖమ్మం, భద్రాద్రి కలెక్టర్లు ముజమ్మిల్ ఖాన్, జితేశ్, ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు విజయనిర్మల, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భూమికి ఎసరు

ఫోర్జరీ సంతకాలతో కబ్జాకు యత్నం

అందోల్, జూలై 10: ఫోర్జరీ సంతకాలతో భూమికి సంబంధించిన అగ్రిమెంట్ డాక్యుమెంట్లను సృష్టించి ఓ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి భూమికే ఎసరు పెట్టేందుకు యత్నించారు ముగ్గురు కేటుగాళ్లు. బుధవారం సంగారెడ్డి జిల్లా జోగిపేటలో సీఐ అనిల్‌కుమార్ వివరా లు వెల్లడించారు. అందోల్‌కు చెందిన మాజీ ఐపీఎస్ అధికారి (సైబరాబాద్ మాజీ సీపీ) శేరి ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులకు 57 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిని కొనుగోలు చేసినట్టు నారాయణఖేడ్ నియోజకవర్గం ర్యాకల్‌కు చెందిన సంజీవరెడ్డి, దెగుల్వాడికి చెందిన సుధాకర్, ముకుందా నాయక్ తండాకు చెంది న రవీందర్ నకిలీ అగ్రిమెంట్ డాక్యుమెంట్లు సృష్టించారు. ప్ర భాకర్‌రెడ్డి, కుటుంబ సభ్యుల సంతకాలు ఫో ర్జరీ చేసి, హైదరాబాద్‌కు చెందిన బిల్డర్ యాదగిరిరెడ్డికి విక్రయ ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌గా రూ.11 లక్షలు తీసుకున్నారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం సంజీవరెడ్డికి యాదగిరిరెడ్డి ఎన్నిసార్లు ఫోన్లు చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన యాదగిరిరెడ్డి నేరుగా అందోల్‌కు వచ్చి ప్రభాకర్‌రెడ్డి కుటుంబసభ్యులను సంప్రదించగా.. ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేసినట్టు తేలింది. ఈ విషయం ప్రభాకర్‌రెడ్డి దృష్టికి వెళ్లడంతో ఆయన నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన జోగిపేట సీఐ.. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు.

పద్మశ్రీ గ్రహీతలకు రూ.25 లక్షలు

హైదరాబాద్, జూలై 10 (నమస్తే తెలంగాణ): పద్మశ్రీ అవార్డు గ్రహీతలకు ఒక్కొక్కరికి సీఎం రేవంత్ రెడ్డి రూ.25 లక్షలు అందజేశారు. బుధవారం సచివాలయంలో అవార్డు గ్రహీతలు గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప, వేలు ఆనందచారి, కూరెళ్ల విఠలాచార్య, కేతావత్ సోంలాల్‌కు చెక్కులను అందించారు.

ఐఎస్‌డబ్ల్యూఏఐ ప్రతినిధులత